

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 14 మే 2025 పేజీలు : 04


# ఉమ్మడి అనంతలో హిందూపురం మున్సిపాలిటీ టాప్

- సమిష్టి కృషితో రూ. 25 కోట్ల ఆదాయం - బాలయ్య కృషితో రూ. 92.50 కోట్లతో అభివృద్ధి పనులు



డిఇ రమేష్,



సంఘం శ్రీనివాసులు

**హిందూపురం మే 13 ప్రభాతవార్త**

సమిష్టిగా కృషి చేస్తే ప్రభుత్వ ఆదాయం పెరిగేలా చేయవచ్చని నిరూపించారు హిందూపురం మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ కుమార్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా ఈసారి హిందూపురం మున్సిపాలిటీ వివిధ అంశాల్లో సుమారు రూ.25కోట్లకు పైగా పన్నుల రూపంలో ఆదాయం సమకూరింది. రాష్ట్ర మున్సిపల్ శాఖ ఇచ్చిన టార్గెట్లను కమిషనర్ శ్రీనివాసులు కింది స్థాయి ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ పన్నుల వసూళ్ల లక్ష్యాలను చేరుకోవడంలో సఫలీకృతమయ్యారు. మున్సిపల్ రెవెన్యూ శాఖ పరిధిలో ఆస్తి పన్ను రూ. 11 కోట్లు పైగా వసూలు చేసి ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచారు. అదేవిధంగా ఖాళీ జాగాల నుంచి రూ. 65 లక్షలకు పైగా పన్నులు సేకరించారు. నీటి పన్ను రూ. 2.5కోట్లు, ట్రేడ్ లైసెన్స్ నుంచి రూ. 24 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా అడ్వర్టైజ్మెంట్ పన్నుల నుండి రూ. 1.61 లక్షలు, క్రమబద్ధీకరణ రూ4లక్షలు, భవనాల అనుమతుల నుండి రూ. 4.40కోట్లు సేకరించారు. కాగా 13,085 మున్సిపాలిటీలో సామాజిక పెన్షన్లకు రూ. 5.64 కోట్లు అందజేస్తున్నారు. మరోవైపు మహిళా సంఘాల పటిష్టత, నూతన సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. మెప్మా విభాగం కింద 70 సంఘాలను కొత్తగా ఏర్పాటు చేయాలన్న లక్ష్యం విధించగా 78 సంఘాలకు ఏర్పాటు చేయడం విశేషం. అదే క్రమంలో బ్యాంకు లింకేజీని ఈసారి 500 సంఘాలకు చేయాలని నిర్ణయించగా అధికంగా 586 సంఘాలకు లింకేజీ కల్పించి మహిళల ఆర్థిక అభివృద్ధిలో తమ వంతు కీలకపాత్ర పోషించారు. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ 2,778 చేయాలని 11,030 కు పెరిగడం అభినందనీయం. ఇదిలా ఉండగా పట్టణంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు, సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గొల్లపల్లి నుంచి అదనంగా నీటిని తెచ్చేందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి సామర్థ్యాన్ని పెంచేలా సక్సెస్ అయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆశీస్సులతో హిందూపురం అభివృద్ధికి మరింత కృషి చేస్తామని అన్నారు. బాల య్యప్రత్యేక కృషితో పట్టణంలో కొత్తగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్ సిస్టం, మొదలగు అభివృద్ధి పనుల కోసం రూ. 92.50 కోట్లు రాష్ట్రప్రభుత్వం ఇటీవల విడుదల చేసిందని హిందూపురం ప్రజల తరఫున వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ కష్టకాలంలో ఉన్నప్పటికీ కోట్లాది రూపాయల నిధులను బాలయ్య విడుదల చేయించడంతో హిందూపురం రూపురేఖలు మారిపోతాయని హర్షం వ్యక్తం చేశారు.

# మురళి త్యాగానికి..దేశం రుణపడి ఉంటుంది..!!

- యుద్ధ వీరులకు... రూ. 50 లక్షలు ఇచ్చే సంస్కృతి వైసీపీ తెచ్చిందే.....
- కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన జగన్
- వీర మరణం పొందిన మురళి నాయక్ కుటుంబానికి రూ, 25 లక్షల సాయం ప్రకటించిన జగన్.







మురళి నాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జగన్, మురళి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న దృశ్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగన్



జనానికి అభివాదం చేస్తున్న జగన్

**గోరంట్ల మే 13 ప్రభాతవార్త**

వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి మాజీసీఎం జగన్ పరామర్శ సందర్భంగా ఆసక్తికర ఘటన జరిగింది. జవాన్ ఫ్యామిలీకి రూ,50 లక్షలు ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి ఆయన థాంక్స్ చెప్పారు. అమరవీరుల కుటుంబాలకు రూ,50లక్షలు ఇచ్చే కార్యక్రమం వైసీపీ ప్రభుత్వం మొదలుపెట్టిందన్నారు. దాన్ని కొనసాగిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తరఫున రూ. 25 లక్షలు ప్రకటించిన ఆయన జవాన్ తల్లిదండ్రులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇండియా పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందిన గోరంట్ల మండలంలోని తల్లి తండా కు చెందిన మురళి నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన గోరంట్ల మండలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మండలములోని జాతీయ రహదారి పాలసముద్రం క్రాస్ వద్ద నుంచి కల్లి తాండ వరకు అడుగడుగునా జగన్మోహన్ రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో గట్టి బందోబస్తు మధ్య కల్లి తండాకు చేరుకున్న జగన్మోహన్ రెడ్డి మురళి నాయక్ నివాసం ముందుకు చేరుకొని మరి తల్లిదండ్రులను పరామర్శిస్తూ వీరమరణం పొందిన మురళి నాయక్ భౌతికంగా మనకు దూరమైన మా గుండెల్లో గూడు కట్టుకుని నిలిచి పోయాడని మీ కుటుంబానికి మేమంతా ఎల్లవేళలా అండగా ఉంటామని వారిలో మనోధైర్యాన్ని నింపారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుద్ధంలో మృతి చెందిన వీర సైనికులకు 50 లక్షల సాయం చేయాలనే ఆలోచన మా ప్రభుత్వ హయం నుంచి పుట్టిందని ప్రస్తుత ప్రభుత్వం సైతం ఆ సంస్కృతిని కొనసాగించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కొనియాడారు. ఆ కుటుంబానికి అండగా తమ వంతు బాధ్యతగా రూ, 25 లక్షల సాయాన్ని ప్రకటిస్తున్నామని ఆయన తెలిపారు. జగన్ చూసేందుకు ఎగబడ్డ జనం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గోరంట్లమండల పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తమ అభిమాన నేత జగన్మోహన్ రెడ్డిని చూసేందుకు ఎగబడ్డారు. జగన్ పర్యటనను పురస్కరించుకొని జిల్లా ఎస్పీ రత్న, పెనుగొండ డిఎస్పి నరసింగప్ప, గోరంట్ల సీఐ పోయే శేఖర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఉషశ్రీ చరణ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, చాంద్ బాషా, అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తరితర జిల్లా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామగిరి మండలంలో వైసీపీకి షాక్ ఇచ్చిన సొంత పార్టీ ఎంపీటీసీలు

- పరిటాల సునీత, శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరిన ముగ్గురు ఎంపీటీసీలు
- గతంలో ఎంపీటీసీలను బలవంతంగా క్యాంపులకు తరలించిన ప్రకాష్ రెడ్డి
- తాజాగా ఎంపీపీ ఎన్నికలకు నోటిఫికేషన్ రాగా ముందే టిడిపిలో చేరిన ఎంపిటిసిలు
- వైసిపి తీరుతో విసిగిపోయాం.. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని పార్టీలో చేరామన్న ఎంపీటీసీలు





టిడిపిలో చేరుతున్న వైఎస్ఆర్‌సిపి ఎంపిటిసిలు

**రామగిరి, మే 13 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలోని వైసీపీ ఎంపీటీసీలు అపార్టీకి షాక్ ఇచ్చారు. గతంలో సభ్యులు గైర్హాజరుతో వాయిదా పడ్డ ఎంపీపీ ఎన్నికకు మరోసారి నోటిఫికేషన్ వెలువడనుంది. ఈనెల 15న నోటిఫికేషన్, 19న ఎన్నిక జరిగే అవకాశం ఉంది. అయితే ఈలోపే వైసిపికి ఆపార్టీ ఎంపీటీసీలు గట్టి స్ట్రోక్ ఇచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సమక్షంలో ముగ్గురు ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వెంకటాపురంలో వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పేరూరు-1 ఎంపీటీసీ కరియన్న, పేరూరు-2 ఎంపీటీసీ భారతి, మాదాపురం ఎంపీటీసీ సంపత్ తెలుగుదేశం పార్టీలోచేరారు. ప్రస్తుతం రామగిరి మండలంలో మొత్తం పదిఎంపిటిసి స్థానాలు ఉండగా.. ఒకరుచనిపోయారు. మిగిలిన 9 మందిలో ఒకరు తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ఎంపీటీసీ ఉండగా.. తాజాగా మరో ముగ్గురు ఎంపీటీసీలు ఆ పార్టీలో చేరడంతో ఎంపీపీ ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. మరో ఎంపీటీసీ తెలుగుదేశం పార్టీలో చేరితే కచ్చితంగా ఎంపీపీని టిడిపి కైవసం చేసుకునే అవకాశం ఉంది. అయితే వైసిపి తీరుతో మొదటినుంచి విసిగిపోయిన ఆ పార్టీ ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో ప్రకాష్‌రెడ్డి ఎంపీపీఎన్నిక సమయంలో వారిని క్యాంపులకు తరలించి నిర్బంధించారు. ఇదే విషయాన్ని తాజాగా పార్టీలో చేరిన ఎంపీటీసీలు కూడా స్పష్టం చేశారు. తాము వైసిపి తీరుతో విసిగిపోయామని, రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి పరిటాల సునీతతోనే సాధ్యమనే నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు చెప్పారు. రెండు నెలల క్రితం జరిగిన ఎంపీపీ ఎన్నిక విషయంలో ప్రకాష్‌రెడ్డి ఎంపీటీసీలందరిని క్యాంపులకు తరలించి ఎన్నిక జరగకుండా చేశారు. పైగా పరిటాల సునీత వారిని బలవంతంగా తీసుకెళ్లారని ప్రచారం చేశారు. అయితే ఇప్పుడు ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్ ముందే ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీలో చేరడంతో వైసిపికి గట్టి దెబ్బ తగిలింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం తమతో కలిసి పని చేసేందుకు ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు.

# ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు దరఖాస్తులో గందరగోళం...!

ఐదు రోజులుగా పనిచేయని ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్

ఈనెల 10వ తేదీకే ముగిసిన దరఖాస్తు గడువు

దరఖాస్తు గడువు పెంచుతారా?లేదా? అన్నది స్పష్టత కరువు

తెలిసినా పట్టించుకోని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర ఉన్నతాధికారులు



**అనంతపురం న్యూటౌన్, మే 13 ప్రభాతవార్త**

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవడంలో గందరగోళం నెలకోంది. గత ఐదు రోజులుగా ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ పనిచేయకపోవడం లేదు. ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉన్నప్పటికీ... రెండు రోజులు ముందు నుండే వెబ్‌సైట్ పనిచేయకపోవడం గమనార్హం. దీంతో ఎస్సీలు దరఖాస్తు గడువు పెంచుతారా? లేదా? అన్నది స్పష్టతలేక గందరగోళానికి గురవుతున్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌కు కొత్త కళ వచ్చింది. అందులో భాగంగా ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు 1427 యూనిట్లను మంజూరు చేసింది. ఆ సబ్సిడీ రుణాలకు ఓబిఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాణ డా.బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుండి మే10వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఇప్పటి వరకు 8902 దరఖాస్తులు వచ్చాయి. అయితే దరఖాస్తుకు ఇంకా రెండు రోజులు గడువు ఉన్నట్లుగానే ఈనెల 8వ తేదీ నుండి ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ పనిచేయడం లేదని ఎస్సీలు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎస్సీలు ఈడీ దృష్టికి తీసుకెళ్లగా...ఈడీ కూడా ఎండీ, జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కానీ ఉన్నతాధికారుల నుండి దరఖాస్తుల గడువు పెంచుతారా? లేదా? అన్నది ఎలాంటి స్పష్టత రాలేదని తెలిసింది. దీంతో ఎస్సీలు సబ్సిడీ రుణాలకు అన్ని పత్రాలు సిద్ధం చేసుకొని దరఖాస్తుకు ఇంకా రెండు రోజులు గడువు ఉన్నట్లుగానే ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో ఎస్సీలు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు గడువు పెంచుతారా? లేదా? అన్నది స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర ఉన్నతాధికారులదే. కానీ రాష్ట్ర ఉన్నతాధికారులు గత ఆరు రోజులుగా ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుండటాన్ని ఎస్సీలు తప్పుబడుతున్నారు. కనీసం ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వీడి దరఖాస్తు గడువు పెంచుతారా? లేదా? అన్నది స్పష్టత ఇవ్వాలని ఉమ్మడి జిల్లాలోని ఎస్సీలు కోరుతున్నారు. అయితే దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

### వెబ్‌సైట్ పనిచేయలేదన్న మాట వాస్తవమే : ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య



ఈడీ సారయ్య

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు ఓబిఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఏప్రిల్ 14 నుండి మే 10వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఇప్పటి వరకు 8902 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈనెల 8వ తేదీ నుండి వెబ్‌సైట్ పనిచేయలేదని తెలిసింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల తీసుకెళ్లాము. తదుపరి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

# ఉపాధి హామీ పథకం పనుల్లో పురోగతి చూపించాలి

- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

**అనంతపురం కలెక్టరేట్ మే 13 ప్రభాతవార్త**

జిల్లాలో దశలవారీగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయడం జరుగుతోందని, ఈ విషయమై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్. సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జి.ఎస్.డబ్ల్యు.ఎస్, ఉపాధిహామీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, తదితర అంశాలపై డీపీఓ, డ్వామా పిడి, జడ్పి సిఈఓ, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, డిఎల్డివోలు, డిఎల్పిఓలు, ఈఓఆర్డీలు, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలల నుంచి స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నామని, విలువైన పనులను ఈ కార్యక్రమాల కింద చేపట్టాలన్నారు. ప్రజల్లో మార్పు తీసుకురావాలని, స్వచ్ఛత అనేది మనం అనుకున్నట్లు జరగాలని, మన ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణాలు, ఆవరణలు ప్రతి ఒక్కటి స్వచ్ఛంగా పెట్టుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీన బీట్ దహీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఈ విషయమై డిపిఓ మానిటర్ చేయాలన్నారు. నగరపాలక సంస్థ, ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఓ నాగరాజు నాయుడు, జెడ్పి సీఈవో రామచంద్రా రెడ్డి, డ్వామా పిడి సలీమ్ భాష, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డా.ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, పిజిఆర్ఎస్ తహసిల్దార్ వాణిశ్రీ, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మునిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే పదవులు

- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి టౌన్, మే13, ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పార్టీకి కష్టపడిన కార్యకర్తలకే భవిష్యత్తులో పదవులు లభిస్తాయని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పార్టీకి పనిచేయని వారిని పదవులకు దూరం పెడతామని హెచ్చరించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుక్కపట్నం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడారు. పార్టీని నిర్లక్ష్యంచేస్తే కార్యకర్తలకే తీవ్రనష్టం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని పటిష్టం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ బలంగా ఉంటే అక్కడ పదవులు ,అధికారం ఉంటాయని తెలిపారు. పార్టీ అప్పగించిన పనులు బాధ్యతతో నిర్వర్తించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీకి పనిచేయకుండా పదవులు కావాలని పోటీ పడడం ఏమాత్రం మంచిది కాదని అలాంటి వారిని పదవులకు దూరంగా ఉంచుదామని తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘు నాథ్ రెడ్డి మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు నాయకత్వం లో అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని వాడిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. నాయకులు మధ్య ఉన్న గ్రూపులు వదిలేసి మన మంతా టీడీపీ గ్రూప్‌గా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బ్రహ్మసముద్రం మే 13 ప్రభాతవార్త

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో అధికారులు ప్రగతి నివేదిక సమర్పించారు అనంతరం సభ్యులు గౌరవ సభ్యులు మండల అభివృద్ధి కోసం చేయవలసిన పనులను


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు అధికారులు

అధికారులకు వివరించారు పలు శాఖల అధికారులు సమావేశం కు దుమ్మా కొట్టగా ఉన్న అధికారులతోనే సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు వారి శాఖల పరంగా వివరించిన ప్రజలకు అందించాల్సిన సేవలను సభ్యులు గౌరవ సభ్యులు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి మండల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు అనంతరం జడ్పిటిసి ప్రభావతమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అమీలినేని సురేంద్రబాబు కృషి చేస్తున్నారని అందులో భాగంగానే కళ్యాణదుర్గం నుండి కన్నేపల్లి వరకు వేపులపర్తి నుండి పోలేపల్లి వరకు రహదారి మంజూరు అయినట్టు తొందరలోనే పనులు ప్రారంభిస్తారని అన్నారు జూన్ మొదటి వారం నుండి బ్రహ్మసముద్రం మండలం కేంద్రం నుండి అధికారులతో పాటు ప్రతి పల్లెకు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకునే కార్యక్రమం మన మండలం నుంచి ప్రారంభిస్తారని ఇందుకు అధికారులు సన్నద్ధం కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నందకిషోర్ ఈ ఓ పి ఆర్ డి రంగనాయకులు డాక్టర్ రాజేష్ కుమార్ శాఖలకు సంబంధించిన అధికారులు సభ్యులు గౌరవ సభ్యులు హాజరయ్యారు.

## ఈనెల 17న బైక్ ర్యాలీకి తరలిరండి

బ్రహ్మసముద్రం మే 13 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

సేవ్ ఆర్ డి టి సేవ్ అనంతపూర్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న మాజీ ఎంపీ కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన సేవాడిటీ సేవ్ అనంతపూర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు బ్రహ్మసముద్రం మండల కేంద్రం నుండి సెట్టూరు కుందుర్పి కంబదూరు కళ్యాణదుర్గం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఆర్డీవోకు వినతి పత్రం అందించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి కోనాపురం గంగాధరప్ప ఎంపీటీసీలు సర్పంచులు ముఖ్య నాయకులు సమావేశమై శనివారం జరగబోయే బైక్ ర్యాలీని మండల వ్యాప్తంగా ఉన్న వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు

## రాష్ట్ర మహిళా సమావేశంలో పాల్గొన్న వైసీపీ మహిళా విభాగ అధ్యక్షురాలు

కనేకల్లు, మే 13 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు కన్నారీ ఉషారాణి విజయవాడ నందు రాష్ట్ర మహిళ సమావేశం సమావేశంలో మంగళవారం పాల్గొన్నారు. రాయదుర్గం నియోజకవర్గమహిళా అధ్యక్షురాలు కన్నారి ఉషారాణి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరదు కళ్యాణి ని మర్యాదపూర్వకంగా మరియు సజ్జల రామకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కాసేపు రాయదుర్గం నియోజకవర్గం గురించి చర్చించుకున్నారు.

## తల్లితండ్రి మరణంతో అనాథలైన చిన్నారులు

డి. హిరేహాళ్, మే 13 ప్రభాతవార్త


అనారోగ్యంతో మృతి చెందిన రజకుల రాజు (42)


తల్లితండ్రి మరణంతో అనాథలైన చిన్నారులు ఉమా, యక్షిత్

తల్లితండ్రి మరణించడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. వివరాలు లోకి వెళ్తే డి. హిరేహాళ్ మండలం పులకుర్తి గ్రామంలో ఆరు నెలలు వ్యవధిలో తల్లి రజకుల గౌరమ్మ అనారోగ్యంతో బాధపడు తూ ఆరు నెలల క్రితం మరణించడం జరిగింది. మంగళవారం ఉదయం రజకులరాజు(42) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. తల్లి తండ్రి ఇద్దరు మరణించ డంతో చిన్నారులు ఉమా ఐదు సంవత్సరాలు, యక్షిత్ నాలుగు సంవత్సరాలు అనాథలుగా మిగిలారు. చిన్నారు లు అనాథులు కావడంతో గ్రామంలో ప్రతిఒక్కరూ కంటతడి పెడుతున్నారు.

## మెగా డీఎస్సీ పరీక్షల ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోండి...!

ధర్మవరం రూరల్ మే 13 ప్రభాతవార్త

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్లైన్ లో ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవాలని సత్య సాయి జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిక అధికారిణి నిర్మల జ్యోతి ఓ ప్రకటన ద్వారా తెలిపినట్టు ధర్మవరం బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షల అర్హత సాధించిన వారికీ ఆన్లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని గడువు లోపు ధర్మవరం పరిధిలోని ధర్మవరం, కనగానపల్లి, తాడిమర్రి, సికె పల్లి, ముదిగుబ్బ, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి, అన్ని ప్రాంతాల వారు బీసీ, ఈ బీసీ కేటగిరీలకు చెందిన అభ్యర్థుల టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన మార్కుల పత్రము, నైటి విటీ మరియు కుల ఆదాయ ధ్రువీకరణ పత్రముల తో పాటు ఆధార్ కార్డ్, రెండు పాస్పోర్ట్ సైజ్ లో ఫోటోలను జతపరిచి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో ఈనెల 15వ తేదీ ఆఖరి గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు పత్రాలను బీసీ వెల్ఫేర్ కార్యాలయము నందు పొందవచ్చునని మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9491982021 ద్వారా సంప్రదించవచ్చునని వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

## చిన్నముష్టూరు గ్రామంలో సీజినల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

-దోమల నివారణ చర్యలను సూచించిన ఆరోగ్య సిబ్బంది

-బోదకాల వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

ఉరవకొండ, మే 13 ప్రభాతవార్త


సీజినల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ


బోదకాల వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో మంగళవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీజినల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం, ఫైలేరియా (బోదకాలు) వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు 6 ప్రత్యేక బృందాలతో ఇంటింటి సర్వే నిర్వహించి రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధులు వస్తాయని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. వారానికి ఒకరోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇంట్లో నీటిని నింపే పాత్రలు, ట్యాంకులను ఖాళీచేసి ఆరబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎం.వి.రమణ, హెల్త్ సూపర్‌వైజర్ జి.శేఖర్, ఏఎన్ఎంలు ఎం.పద్మావతి, ఎం.చాముండేశ్వరి, ఆర్.కోమలాదేవి, కె.అనూష, వి.హేమలత, ఎన్.లలిత, ఆరోగ్య కార్యకర్తలు ఎన్.వెంకటేశులు, పి.రాఘవేంద్ర, జి.ముకుంద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళ వద్ద 6 తులాల బంగారు చోరీ

గుత్తి, మే 13 ప్రభాతవార్త

గుత్తి ఆర్టీసీ బస్టాండులో కర్నూలుకు చెందిన సుభాని అనే మహిళ వద్ద 6 తులాల బంగారు చోరీ అయింది. ఆమె తమ కుటుంబ సభ్యులు తో కలిసి గుంతకల్లుకు ఓ ఫంక్షన్ కు హాజరైంది. తిరిగి కర్నూల్ వెళ్తుండగా గుత్తిలో తన హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు చోరీ అయినట్లు గమనించింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

## జిల్లా కార్యదర్శిలకు ఘన సన్మానం

బ్రహ్మసముద్రం మే 13 ప్రభాతవార్త


సన్మానం చేస్తున్న దృశ్యం

మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి కోనాపురం గంగాధరప్ప ఎంపీటీసీ సర్పంచులు ముఖ్య నాయకులు వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం జిల్లా కార్యదర్శులుగా ఎన్నికైనటువంటి ఆకుతోట గోపాల్ రెడ్డి, పై ఇంటి మంజునాథ్ లను పూలమాల దృశ్యాలువాతో ఘనంగా సన్మానించారు

## చెత్త సేకరణను పరిశీలించిన ఈఓపీఆర్డి రంగనాయకులు

బ్రహ్మసముద్రం మే 13 ప్రభాతవార్త


చెత్త సేకరణను పరిశీలిస్తున్న దృశ్యం

మండల కేంద్రం లోని కోనాపురం గ్రామంలో మంగళవారం ఈవోపీఆర్డి రంగనాయకులు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు కోనాపురం గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఆకస్మిగంగా తనిఖీచేస్తూ గ్రామంలో వీధులగుండ ప్రజలతో రోజు ఉదయం చెత్తసేకరణచేస్తున్నారా లేదాఅని తెలుసుకొని సంబంధించిన అధికారులకు విధులుపట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రతిరోజు సేకరణ చేయాలని తెలియజేశారు కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల వలిత మల్లి డిప్యూటీ పంచాయతీ కార్యదర్శి అనిత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాకెట్ల గ్రామంలో కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమం

-బాలల హక్కులు, రక్షణ, బాల్యవివాహన నిషేద చట్టంపై అవగాహన

ఉరవకొండ, మే 13 ప్రభాతవార్త


రాకెట్ల గ్రామంలో జరిగిన కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో డాక్టర్ బి.ఎన్.శ్రీదేవి

మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమం జరిగింది. మండల స్థాయిలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ఐసీడీఎస్ ఉరవకొండ సీడీపీవో డాక్టర్ బి.ఎన్.శ్రీదేవి హాజరై మాట్లాడుతూ బాలల హక్కులు, రక్షణ, బాల్య వివాహ నిషేద చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలవల్ల కలిగే నష్టాలు, అనర్థాలు, పిల్లలపై లైంగిక దాడుల నివారణ చట్టం 2012 గురించి వివరించారు. వేసవి సెలవుల దృష్ట్యా మే 2వ తేదీ నుండి జూన్ 10 వరకు దశలవారిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, రుతుక్రమం, పరిశుభ్రత, బాలల హక్కులు, పోషణ, ఆరోగ్యం, లింగ సమానత్వం, విద్య ఆవశ్యకత, నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా దృశ్య రూపకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో ఎల్లమ్మ, సూపర్‌వైజర్ రబియా, ఎంఎస్‌కే రామాంజినమ్మ, ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రామాంజినమ్మ, అన్నపూర్ణ, జయమ్మ, చంద్రకాంత, సుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధత కల్గిన మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మరణం తీరనిలోటు

-తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఎస్.కె.కేశవనాయక్

ఉరవకొండ, మే 13 ప్రభాతవార్త

నీతి, నిజాయితీ, నిబద్ధత కల్గిన మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మరణం తీరని లోటని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, బంజారా జాతీయ నేత ఎస్.కె.కేశవనాయక్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ దరూరు పుల్లయ్య, సర ్పంచ్‌గా, సమతి అధ్యక్షులుగా, ఎంపీగా అనంతపురం జిల్లా అభివృద్ధికి సాగునీటి రంగానికి ఎనలేని కృషి చేశారన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు సాధన సమితిలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి పనిచేసిన రోజులను ఎస్.కె.కేశవనాయక్ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తులసిదాస్‌నాయక్, బీజేఎస్ నాయకులు మహేష్‌నాయక్, సుబ్రమణ్యంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వ వాహనంపై దర్శనమిచ్చిన సంగ మేశ్వరుడు

నేడు చివరి రోజు వసంతోత్సవం



కొత్తచెరువు మే 13 ప్రభాతవార్త

ప్రసన్న పార్వతి సమేతి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలులో భాగంగా మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో పర్వటోత్స వము ప్రత్యేకంగా అలంకరించబడిన అశ్వ వాహనంపై సంగమేశ్వరుడు పట్ట ణ వీధులకుండా స్వామివారు దర్శనమిచ్చారు అర్చకులు సాయినాథ్ శర్మ భక్తాదులు స్వామి వారికి ఫల పుష్పాలు అందజేసి సంగమేశ్వర స్వామికి కొబ్బరికాయలు కొట్టి భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు నేడు బుధవారం ఉదయం 9 గంటలకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు వసంతోత్సవం పుష్పయాగ , ఉంజల్ సేవ కార్యక్రమాలతో శ్రీ సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వహకులు తెలిపారు.

## దివ్యాంగుడని చూడకుండా ఆర్థికంగా దెబ్బతీసిన భార్య

- తరచూ ఇంట్లో కాలితో తన్నుతూ భార్య కుటుంబ సభ్యులంతా చిత్రహింసలు చేశారని ఆవేదన

- నగలు, డబ్బు, కారుతో పరారైన భార్య కుటుంబ సభ్యులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన దివ్యాంగుడు ఫయాజ్

బెలుగుప్ప, మే 13 ప్రభాతవార్త





మండలకేంద్రంలో మండలపరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఇబ్రహీం ఫయాజ్ మంగళవారం తన భార్య తననుమోసంచేసి ఇంటిలోని నగదు, బంగారం, తదితరాలు తీసుకుని వెళ్లిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రతిసారి ఇంట్లో తనను దివ్యాంగుడినని చిత్రహింసలకు గురి చేస్తుండేదని వాపోయాడు. గత నెల శనివారం (ఏప్రిల్ 29) అదే పనిగా గొడవకు దిగి తన (ఫయాజ్)ను అతని భార్య షేక్ సబినా, అక్క జరినా, తల్లి దండ్రులు కలిసి చిత్ర హింసలు చేశారని వాపోయారు. ఫయాజ్ బాషా అనంతపురం పట్టణానికి చెందిన వారన్నారు. అతనికి అక్క, చెల్లెలు, తమ్ముడు, తల్లిదండ్రులు ఉన్నారు. విధి నిర్వహణలో ప్రమోషన్ రావడం వల్ల సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేవాడు. అతని భార్య షేక్ సబినా అతనికి సంబంధించిన 41 లక్షలు విలువ చేసే భవనాన్ని ఫయాజ్‌ను మోసం చేసి అమ్మేసిందన్నారు. అదే విధంగా అతని భయభ్రాంతులకు గురి చేసి బెదిరించి మరీ భార్య అక్క జరినాకు హెచ్‌డిఎఫ్‌సిలో 30లక్షలు రూపాయలు పర్సనల్‌లోన్ జరినాకు ఇప్పించేలా చేశారన్నారు. అయినప్పటికీ అతని భార్య అక్క ఆ లోన్ చెల్లించకపోవడంతో ప్రతి నెలా తాను రూ.60వేలు చెల్లించాల్సి వస్తోందని అయినప్పటికీ తరచూ లోన్ కట్టమని వారిని ప్రాదేయ పడినా కనికరించక దివ్యాంగుడినని చూడకుండా దూషిస్తూ చిత్రహింసలకు గురి చేస్తూ ఉండేవారన్నారు. లోన్‌కు శాలరీ అంతా కట్ అవుతుండటంతో ప్రశ్నిస్తుండటంతో అదే పనిగా గొడవకు దిగేవారన్నారు. ఆమె శనివారం (ఏప్రిల్ 29) రోజు విధులు ముగించుకుని ఫయాజ్ బాషా ఇంటికి వచ్చినప్పుడు అతనిని కాళ్లతో తన్ని చిత్రహింసలు పెటి , కాళ్లు చేతులు కట్టివేసి ఇంటి సామాగ్రి, ఐదు తులాల బంగారం, కారును కూడా ఎత్తుకుని వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఫయాజ్‌బాషా తెలిపారు. దాదాపు 88 లక్షలు తీసుకుని భార్య కుటుంబ సభ్యులతో సహా తనను మోసం చేసి వెళ్లిపోయిందన్నారు. ఇప్పటివరకు తెలిసిన ప్రదేశాలు, బంధు మిత్రుల వద్ద వెతికినా కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పినట్లు తెలిపారు. తనను ఆర్థికంగా దెబ్బతీసి, తనను మోసం చేసి వెళ్లిపోయిన నా భార్యను వెతికి తన నుంచి తస్కరించి తీసుకెళ్లిన డబ్బు, నగలు, కారులను తనకు ఇప్పించి ఆదుకోవాలని బెలుగుప్ప ఎస్ఐకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. తనను కలిసిన విలేకర్లతో తన గోడును వెల్లడించి కన్నీటి పర్యాంత మయ్యారు.

## ముస్లీంల అస్తిత్వానికి ఎక్కడ ప్రమాదం ఉన్నా అక్కడ పరిటాలశ్రీరామ్ ఉంటాడు...!

- ఒక గొడవ విషయాన్ని కొందరు తమ స్వార్థానికి వాడుకోవాలని చూశారు.- ధర్మవరంలో మైనార్టీల జోలికి వస్తే ఊరుకునేదిలేదు పరిటాలశ్రీరామ్

ధర్మవరం, మే 13(ప్రభాతవార్త)


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా ముస్లింల ఆస్తితత్వానికి ప్రమాదంవచ్చినా... అక్కడ నేను ఉంటానని నియోజకవర్గ టీడీపీఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మం గళవారం లక్ష్మీచెన్నకేశవపురంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో పరిటాల శ్రీరామ్ ధర్మవరంసమీపంలో ఒక దాబాలో సోమవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి ఆయనస్పందించారు. కొందరు వ్యక్తులు దాదాఖలందర్పై దురుసుగా వ్యవహరించారు. ఈ సంఘటనపై వన్‌టౌన్ సీఐనాగేంద్రప్రసాద్‌లకు పోన్ చేసి మాట్లాడానన్నారు. ఈ ఘటనలో ఎవరున్నా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చెప్పానన్నారు. అయితే ఈవిషయాన్ని కొందరు తప్పుదోవ పట్టిస్తున్నార న్నారు. పోలీసులు కూడా వెంటనే కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అయితేతాను ఇంత వేగంగా స్పందిస్తానని కొం దరు వకులుఊహించిఉండరని, ఈగొడవను తమకు అనుకూలంంగా మార్చుకునేం దుకు వారు కుటిల ప్రయత్నాలుచేసి విఫలమయ్యారన్నారు. తాను ఇంతవే గంగా స్పందిస్తానని వారికి బాదకూడా ఉండొచ్చని పరిటాలశ్రీరామ్ వ్యాఖ్యా నించారు. తమ కుటుంబానికి ముస్లీంలకు ఎంతో అవినాబావ సంబంధంఉం దన్నారు. తాను ఆంజనేయస్వామి ఎలా ఆరాధిస్తానో అల్లాను కూడా అలాగే ఆరాదిస్తానని పరిటాలశ్రీరామ్ స్పష్టం చేశారు.

### పరిటాలశ్రీరామ్ అర్ధరాత్రి వేళ పోన్ చేసి నాకు అండగా నిలిచారు- దాదాఖలం దర్

సోమవారంరాత్రి మామిళ్లపల్లి వద్దఉన్నదాబాలో తనపట్ల కొందరు వ్యక్తులు అనుచితంగా వ్యవహరించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మా స్నేహితులు నాకు అండగా నిలిచారు. అదే సమయంలో పరిటాలశ్రీరామ్ అర్ధరాత్రి 12గంటల సమయంలో ఫోన్ చేసి నాకు అండగా నిలిచారు. ఈ ఘటన పోలీసులు కేసు నమోదు చేసి చర్యలుతీసుకునేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## గుత్తిలో ఇంటి పన్నుపై అధికారులతో మున్సిపల్ కమీషనర్ సమావేశం

గుత్తి, మే 13 ప్రభాతవార్త


కమీషనర్ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి మునిసిపాలిటీలో నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటి స్థితిని గుర్తించి మునిసిపల్ చట్టం 1965 మార్గదర్శకాలు అనుసరించి ఇంటి పన్నుల ప్రక్రియ 10రోజుల్లో పూర్తి చేయాలని మునిసిపల్ మేనేజర్, రెవెన్యూఆఫీసర్, అడ్మిన్ సెక్రెటరీలు మరియు మునిసిపల్ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి సదరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ జబ్బార్ మియా ఆదేశించారు. 202526 కు సంబంధించిన పన్ను వసూలు 100 శాతం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన అడ్మిన్ సెక్రెటరీలను ఆదేశిస్తూ తమ సచివాలయ ప్రతి వార్డులో కొత్తగా ఇంటి నిర్మాణం పూర్తయిన వాటిని గుర్తించి సదరు సమాచారం ప్రకారం ఇంటి పన్ను వేయాలన్నారు. కావున ప్రతి అడ్మిన్ సెక్రెటరీ వారు, రెవెన్యూ అధికారులు సహకార భావంతో పై అధికారులు ఇచ్చిన నిర్దేశితాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ ప్రకటన ద్వారా పట్టణ ప్రజలకు విజ్ఞప్తిగా తమ ఇంటి నిర్మాణం పూర్తయిన వెంటనే తమ సంబంధిత సచివాలయంలో అడ్మిన్ సెక్రెటరీ ద్వారా ఇంటి పన్ను ప్రక్రియ పూర్తి చేయించుకుని మునిసిపాలిటీ వారు అందించే సదుపాయాలను పొందాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, టీపిఓ మారుతి ప్రసాద్, ఆర్.ఓ కమలాకర్, సతీష్, రెవెన్యూ సెక్షన్‌క్లర్క్ రామరాజ్యలక్ష్మి, డి.పి.ఓ నరేష్, అడ్మిన్ సెక్రెటరీలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# హంద్రీనీవా పై బహిరంగ చర్చకు సిద్ధం..!

- 2014 నుండి కాదు 1983 నుండి ఏ ప్రభుత్వం సాగునీటి రంగానికి ఎంత ఖర్చు చేసిందో చర్చిద్దాం
- ప్రాజెక్ట్ పుట్టినప్పటి నుండి నేటి వరకు ఎవరి పాలనలో ఎంత పురోగతి సాధించిందో ప్రజలకు చెబుదాం
- వాస్తవాలు చర్చించడానికి ఉరవకొండకు కాలవ శ్రీనివాసులు ఎప్పుడొస్తారో చెప్పాలి
- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సవాల్ కు ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై. శివరామిరెడ్డి ప్రతి సవాల్

ఉరవకొండ, మే 13 ప్రభాతవార్త

హంద్రీనీవా విషయంలో తెలుగుదేశం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విసిరిన సవాల్ ను స్వీకరిస్తున్నామని, హంద్రీనీవా అభివృద్ధి విషయములో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చ కోసం ఎప్పుడు, ఎక్కడికి రావాలో కాలవ శ్రీనివాసులు చెప్పాలని ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై. శివరామిరెడ్డి ప్రతి సవాల్ విసిరారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి మాట్లాడుతూ కాలువ శ్రీనివాసులు 2014వ సంవత్సరం నుండి చర్చిద్దాం అంటున్నారు గానీ మీ నాయకుడు ఇక్కడకు మొన్న వచ్చినప్పుడు హంద్రీనీవా అంటేనే తెలుగుదేశం పార్టీ మానసపుత్రిక అని ప్రగల్భాలు పలికారని ప్రాజెక్టు పుట్టినప్పటి నుండి ఎవరి ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చిద్దామన్నారు. 1983 85 సంవత్సరాల మధ్య దివంగత నేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి అప్పట్లో చేపట్టిన రాయలసీమ ఉద్యమం ద్వారా రూపాంతరం చెందిన ప్రాజెక్టులే హంద్రీనీవా, గాలేరి నగరి ప్రాజెక్టులని ఇది చరిత్రని దీనిని తప్పుదోవ పట్టించడానికి ఎవరి తరం కాదన్నారు. 1987లో ఎన్టీఆర్ హంద్రీనీవాకు శంకుస్థాపన చేశారని ఆయన అధికారంలో ఉన్నన్నాళ్లూ ఎక్కడా పనులు జరగలేదన్నారు. 1996 మార్చి 11వ తేదీన ఉరవకొండలోని పోలీస్‌స్టేషన్ ఎదుట చంద్రబాబు మరోసారి హంద్రీనీవాకు శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారని 1999 ఎన్నికలు వచ్చే సమయానికి కూడా గంప మన్ను తీయలేదన్నారు. చివరకు ఫౌండేషన్ వేసినందుకు కాంట్రాక్టర్‌కు డబ్బులు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. మళ్లీ 1999 జూలై 9వ తేదీన ఆత్మకూరులో 40 టీఎంసీల హంద్రీనీవాను 5 టీఎంసీలకు కుదించి శంకుస్థాపన చేశారన్నారు. ఆ తర్వాత పనుల్లో ఎలాంటి పురోగతి లేదన్నారు. 2004లో వై.ఎస్. రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక 2005లో ఉరవకొండలో మళ్లీ 40 టీఎంసీలతోనే శంకుస్థాపన చేశాకే పనులు ప్రారంభం అయ్యాయని వివరించారు. మల్యాల నుంచి 12 పంపుల ద్వారా జీడిపల్లికు మొదటి దశ, జీడిపల్లి నుంచి పుంగనూరు వరకు రెండో దశ పనులు చేపట్టారని, 6.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని తలచారన్నారు. వై.ఎస్.ఆర్ హయాంలోనే హంద్రీనీవాకు సుమారు రూ.5 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారని 2012 నవంబర్ 18వ తేదీన మల్యాలలో కృష్ణా జలాలను హంద్రీనీవా ద్వారా అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి విడుదల చేస్తే రఘువీరారెడ్డితో పాటు అనంత వెంకట్రామిరెడ్డి, ఎంతో మంది నాయకులు నీటి వెంబడి పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. 2012 నవంబర్ 29వ తేదీన జీడిపల్లికి నీరు తెచ్చామని ఆ రోజు జీడిపల్లిలో జరిగిన సభకు పయ్యావుల కేశవే అధ్యక్షత వహించారన్నారు. కాలవ శ్రీనివాసులు చర్చించడానికి వచ్చేముందు నేనడిగే ప్రశ్నలకు ప్రజాక్షేత్రములో సమాధానాలు తెలపాలని వై. శివరామి రెడ్డి కోరారు. తెలుగు దేశం హయాంలో శంకుస్థాపనలకే హంద్రీనీవా పరిమితం కాగా 40 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు కుదించిన ఘనత తెలుగుదేశం పార్టీది కాదా?, వై.ఎస్.ఆర్. సీఎం అయ్యాకే హంద్రీనీవా పనులు పరుగులు పెట్టాయా లేదా?, 2012 నుంచే జీడిపల్లికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు వచ్చయా..?.. రాలేదా?, జగన్ సీఎం అయ్యాక హంద్రీనీవా సామర్థ్యం 6,300 క్యూసెక్కులకు పెంచుతూ జీవో జారీ చేసారా లేదా?, వైఎస్ఆర్‌సీపీ హయాంలోనే రూ.4,647 కోట్లతో టెండర్లు పూర్తి అయ్యాయా లేదా?, కూటమి అధికారంలోకి వచ్చాక టెండర్లు ఎందుకు రద్దు చేశారు?, మళ్లీ 3,850 క్యూసెక్కులకే హంద్రీనీవా పరిమితం చేయడం వెనుక ఆంతర్యమేమిటి?, వీటికి


ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై. శివరామిరెడ్డి

సమాధానాలు చెప్పి తర్వాత చర్చకు రావాలన్నారు. హంద్రి నీవా పై చర్చించడానికి ఆ కాలువ పారే ప్రతి గ్రామములోని రైతు సిద్దంగా ఉన్నారని స్పష్టం చేశారు. 10 వేల క్యూసెక్కులకు హంద్రీనీవా సామర్థం పెంచేలా పనులు చేయండి అప్పుడే చరిత్రలో మీ పేరు నిలబడి పోతుంది అని చెప్పడం నేరమా?, ఇప్పటికే కాలువ సామర్థం 3,850 క్యూసెక్కులు ఉంటె తిరిగి అదే సామర్థ్యానికి పనులు చెయ్యడమేమిటని ప్రశ్నించడం తప్పా?, వాస్తవాలు మాట్లాడితే ప్రజల్లో విశ్వాసం కోల్పోతామా?, మీరు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నామనడం హాస్యాస్పదం అని ఎమ్మెల్సీ ఎద్దేవా చేశారు. సభలో కూర్చున్న రైతులతో ఎకరాకు 60 వేల రూపాయలు ఏడాదికి కౌలు వస్తుందని అపద్దాలు చెప్పిస్తారా? ఏ గ్రామములో సభ పెట్టారో అదే గ్రామములో రైతులదగ్గర మనిద్దరం కూర్చుందాం, ఏటా 60 వేల రూపాయలు కౌలు ఎంతమందికి వస్తుందో లెక్కలు తేలుద్దాం? నిజాలు మాట్లాడేందుకు నాయకులు అవసరం లేదని హంద్రీనీవా కాలువ పారుతున్న ప్రతి గ్రామములోని రైతులే చాలన్నారు. వారి సమక్షములోనే ఏ ప్రభుత్వాలు ఈ ప్రాజెక్ట్ పుట్టినప్పడి నుండి ఎంత ఖర్చు చేసాయో చర్చకు మేము సిద్ధమని కాలవ శ్రీనివాసులే సమయాన్ని నిర్ణయించి ఎప్పుడు ఉరవకొండకు వస్తారో మాకు తెలిపితే చాలు అని ఎమ్మెల్సీ వై.శివరామి రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధిని చూపించాలి గాని ఇలా అసత్య ప్రచారాలు చేసుకోవడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించకూడదంటూ ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి ఈ సందర్భంగా హితవు పలికారు.

06ATP27_06ATP27.qxd 13-05-2025 PM 11:25 Page 1



## రేషన్‌కార్డుల కోసం ఇబ్బడి ముబ్బడిగా జనం

అగళి, మే 13 ప్రభాతవార్త



రేషన్‌కార్డుల కోసం వచ్చిన జనం

ప్రభుత్వం పేదలకు శుభవార్తను అందించింది. కొత్తరేషన్ కార్డులతో పాటు ఉన్న రేషన్‌కార్డులలో పేర్లు నమోదు చేయించుకొనుటకు, తీసి వేయుటకు అవకాశం కల్పించడంతో మండలంలోని ప్రతి సచివాలయం వద్ద రేషన్‌కార్డుల కోసం పేదలు క్యూ కడుతున్నారు. రేషన్‌కార్డులకు సంబంధించి ఆధార్‌కార్డు తదితర వివరాలను సమర్పించిన అనంతరం ఆన్‌లైన్ అయిన తర్వాత ఈకెవైసి చేసుకుంటే ఆ ప్రక్రియ పూర్తి అవుతుంది. అటు ఆన్‌లైన్ కోసం ఇటు ఇకెవైసి కోసం జనం ఇబ్బడిముబ్బడిగా వస్తున్నారు. సచివాలయ సిబ్బంది రేషన్‌కార్డుల కోసం వచ్చిన వారికి ఆ ప్రక్రియను పూర్తి చేసి పంపాలని తహశీల్దారు సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు తెలిపారు.

## అనాధాశ్రమంలో అన్నదానం

గుత్తి, మే 13 ప్రభాతవార్త



అన్నదానం చేస్తున్న దృశ్యం

పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్ మెమోరియల్ ట్రస్ట్ అనాధాశ్రమంలో మంగళవారం ఉపాధ్యాయుడు గొల్ల సోమయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దాతలు లక్ష్మి వరప్రసాద్ మాట్లాడుతూ తమ సంతానం హరిహరన్ గాయత్రీల జన్మదినం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్ చౌదరి, విజయకుమార్, సునీత, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ సమాధి వద్ద మొక్క నాటిన వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నేత



వీర జవాన్ సమాధి వద్ద మొక్క నాటుతున్న దృశ్యం.

గోరంట్ల మే 13 ప్రభాతవార్త

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా శత్రు మూకలను తుది ముట్టిస్తూ వీరమరణం పొందిన జవాన్ మురళినాయక్ కి నివాళులు అర్పించడంలో భాగంగా అయన జ్ఞాపకార్థం సమాది వద్ద మామిడి మొక్కను నాటిన వైఎస్ ఆర్ సీపీ స్టేట్ ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి సలేమ్మ,సాయికృష్ణ. ఈసందర్బంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చడం జరిగింది ఎంతోమంది యువతకు స్ఫూర్తినిచ్చిన మురళి మరణం తల్లిదండ్రులకు తీరని లోటు అయిన వారి జన్మ చరితార్థం ఐనదని వారుపేర్కొనడం జరిగింది . ఈ కార్యక్రమంలో వినోద్,జేసీబీ, గంగాధర్ మే డా పురం,చంటి తదితరులు పాల్గొన్నారు.

## మూలకు చేరి తుప్పు పడుతున్న ఏండియు వాహనాలు.

వజ్రకరూర్ మే 13 ప్రభాతవార్త




తుప్పు పడుతున్న ఎండియు వాహనాలు

ఇంటింటికి రేషన్ బియ్యం అందించాల్సిన ఎండియు వాహనాలు మూలకు చేరి తుప్పుపట్టి పనికి రాకుండా పోతున్న ఘటనలు మండలంలో చోటుచేసుకుంటున్నాయి.గత ప్రభుత్వ పాలనలో రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు ఎండియు వాహనం ద్వారా అందించేవారు . ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వివిధ కారణాలతో కొందరు ఎం డి యు డ్రైవర్లు వాహనాలను తహసిల్దార్ కార్యాలయానికి తిరిగి అప్పచెప్పారు వాటిని అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూలకు చేర్చారు.వీటిని వినియోగించకపోవడంతో టైర్లు పనికి రాకుండా పోయాయి. ఇంజన్ కూడా తుప్పు పట్టి మరమ్మతులకు గురయ్యింది. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలను పట్టించుకోకపోవడంతో తుప్పు పట్టి పనికి రాకుండా పోవడమే కాక లక్షలాది రూపాయల ప్రజాధనం వృధాగా మారింది.ఈ విషయాన్ని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

## అమరవీరుడు వీర జవాన్‌కు నివాళులర్పించిన వైకాపా నాయకులు

అమరాపురం మే 13 ప్రభాతవార్త



నివాళులర్పిస్తున్న దృశ్యం

మడకశిర నియోజకవర్గ ముఖ్య నాయకులు అమరాపురం మండలం నుండి స్థానిక వైకాపా నాయకులు అమరవీరుడు వీరచవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని సందర్శించి ఘనంగా మంగళవారం నివాళులర్పించారు. గోరంట్ల మండలం కల్లి తాండ గ్రామంలో వీర జవాన్ మురళి నాయక్ సమాధిపై జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి జి.బి .శివకుమార్, అమరాపురం మండల వైకాపా కన్వీనర్ త్రిలోక్ నాథ్, తాలూకా బి సి సెల్అధ్యక్షుడు దేవగానపల్లి శివకుమార్, తాలుకా యస్ సి సెల్ అధ్యక్షుడు ఉప్పార్లపల్లి శివన్న,బసవంపల్లి యం పి టీ సి నరసింహామూర్తి,శివరం సర్పంచ్ చిత్తన్న, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్,సోషల్ మీడియా దేవగానపల్లి రమేష్,గొల్ల మారనపల్లి రంగనాథ్, తదితరులు పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వనితావాణి బాధ్యతలు...!

ధర్మవరం, మే 13(ప్రభాతవార్త)



నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపడుతున్న వనితవాణి

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వనితావాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి రెండునెలల క్రితం పదవీవిరమణ పొందారు. అప్పటి నుంచి మహాలక్ష్మీ ఇన్చార్జ్ ప్రిన్సిపల్గా కొనసాగింది. ఈ క్రమంలో ప్రభుత్వ బాలురజూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న వనితావాణి పదోన్నతిపై బాలికలజూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాధ్యతలు చేపట్టారు. దీంతో కళాశాల అధ్యాపకులు శుభాకాంకాలు తెలిపారు.

## బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత మనందరిదీ

పుట్టపర్తి రూరల్ మే 13 ప్రభాతవార్త :



క్యాంపెయిన్ ఆటోను ప్రారంభిస్తున్న ఆర్డీవో

బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అధికారులు అందరీ పైన ఉందని పుట్టపర్తి ఆర్డిఓ పేర్కొన్నా రు. సోమవారం ఆర్డీవో కార్యాల యం లో సైబర్ నేరాలు బాల్య వివాహాలు, అరిక ట్టే విషయంపై, ఆటో కాంపెయిన్ బ్యానర్లు, వాయిస్‌ద్వారా చిల్డ్రన్‌ఆఫ్ ఇండియా ఫౌండేష న్, జిల్లా బాలల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి సేవా సంఘం సెక్రెటరీ విరనారప్ప సహకారంతో ప్రజలకు అవగాహన కల్పిం చేందుకు పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ సీడీపీఓ గాయత్రి తో కలిసి జెండా ఊపి ఆటో కాంపెయిన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్డీవోసువర్ణ మాట్లాడుతూ ఆన్లైనులో మీరు ఎంత గోప్యతగా ఉంటే అంత శక్తివంతులుగా ఉంటారని సైబరు మయమైన ప్రపంచంలో మన వివరాలు అన్ని గోప్యంగా ఉంచుకోవలసిన అవసరం ఉందని ఎవరికి పడితే వారికి మన వివరాలు అడగ్గానే ఇవ్వకుడదని వాటిపట్ల అప్రమత్తత ఆవశ్యకం మరింత అవసరమని తెలిపారు.అంతే కాకుండా జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ఎవరైనా పిల్లలకు బాల్య వివాహము చేసినట్టు తెలిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల నడవడిక చూసుకుంటూ మొబైల్ వాడకం పట్ల జాగ్రత్తగా ఉండే విధంగా పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో ఈ ఆటో కాంపెయిన్ అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని,అవగాహన చేసుకున్న వారందరూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉంటూ పిల్లలను బాల్య వివాహాలకు గురి కాకుండా చూడాలన్నారు. పుట్టపర్తి మునిసిపాలిటి పుర వీధులలో ఆటో కాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ మహేష్,చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప,ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, సోసియల్ వర్కర్ ఆనంద్, జగదీష్, యూత్ అంబాసిడర్లు మనిదీప్,సురేంద్ర, సుష్మిత,విరనారప్ప పాల్గొన్నారు.

## పదోన్నతిపై వెళ్లిన ఉద్యోగికి ఘనంగా సన్మానం

అమరాపురం మే 13 ప్రభాతవార్త



సన్మానం చేస్తున్న దృశ్యం

అమరాపురం మండలంలో ఉపాధి హామీ పథకం నందు టెక్నికల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై ఏపీఓగా బదిలీపై ఆగళి మండలానికి వెళ్లిన మంజునాథ్ ను ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలవేసి ఘనంగా సన్మానం చేశారు. మండలంలో గత 15 నెలలుగా టెక్నికల్ అసిస్టెంట్ గా మంజునాథ్ కూలీల శాతం పెంచడంతోపాటు రైతులకు రైతు కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం అందించే కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకొని వచ్చి సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమం నందు మండల పరిపాలనాధికారి ఆరాధ్య జేఈ జగదీష్, టిడిపి మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, టిడిపి యువ నాయకులు అగ్రహారం నవీన్ కుమార్, నాగోనపల్లి మంజునాథ్, అమరాపురం నాగరాజు,మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, వీరపసముద్రం మంజునాథ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నప్ప, ధనుంజయ, డీలర్ జయన్న, కృష్ణమూర్తి, నాగరాజు ,మంజునాథ్, టెక్నికల్ అసిస్టెంట్లు హనుమంతరాయ, సుకూర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రంగారెడ్డి, ముద్దరాజు, గౌడరంగప్ప, గిరీష్, చంద్రశేఖర్, దేవరాజు, ప్రదీప్ రెడ్డి, నాగరాజు, ఎర్రగుంటప్ప, జూనియర్ అసిస్టెంట్ రవి, ఆపరేటర్ జయ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వజ్రకరూరు మే 13 ప్రభాతవార్త



పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తున్న రిసోర్స్ పర్సన్

గ్రంధాలయాలు విజ్ఞాన బండాగారాలని వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిని మునెమ్మ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లలకు ఆటల పోటీలు చదువులో రాణించడానికి మెలుకువలు, డ్రాయింగ్ నేర్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. పిల్లలు సెలవులను వృధా చేయకుండా శిబిరంలో పాల్గొని నైపుణ్యం సాధించాలని కోరారు.

## ధర్మవరంలో సచివాలయాలను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్...!

ధర్మవరం, మే 13(ప్రభాతవార్త)



ఇందిరానగర్ సచివాలయాన్నితనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

పట్టణంలోని ఇందిరానగర్, పీఆర్టీ, గీతానగర్ వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ మంగళవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాయాల్లో రిజిస్టర్స్, రికార్డులు సరిగా మెయింటెన్ చేయడంలేదని, విధులకు సరిగాహాజరు కాకుండా విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ప్రతి రోజు సచివాలయాల తనిఖీ నిరంతరం తనిఖీ చేపడుతానన్నారు. సచివాయాలకు వచ్చే ప్రజల సమస్యలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వారినిసచివాలయాల చుట్టు తిప్పుకోరాదన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బత్తలపల్లి, మే 13 ప్రభాతవార్త

బత్తలపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నామని, దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శివయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లి సబ్ స్టేషన్ లో మరమ్మతులు చేపట్టనుండడంతో బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని బత్తలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

## శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులతో చర్చలు విఫలం..!

-బకాయి జీతం, ఈపీఎఫ్ చెల్లించడానికి గడవు కోరిన అధికారులు

-ఇలా మూడుసార్లు హామీ ఇచ్చి అన్యాయం చేశారన్న కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఈఈ, డీఈఈ తదితరులు

ఉరవకొండ, మే 13 ప్రభాతవార్త

న్యాయమైన డిమాండ్ల సాధనకై సమ్మె చేస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఆర్డీవో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. పీఏబీఆర్ జలాశయంలో మంగళవారం మధ్యాన్నం ఈ చర్చలు జరుగగా అనంతపురం ఆర్డీవో కేశవనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్, ఈఈ మురళీధర్‌రావు, డీఈఈ శిరీష, ఏఈ శ్రీనివాస్,



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు జి.ఓబులు

తహశీల్దార్ మహబూబ్‌బాషా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు ఓబులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, యూనియన్ అధ్యక్షులు స్వామి, కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి, ఇతర కార్మికులతో సుదీర్ఘంగా చర్చించారు. 38 రోజులుగా కొనసాగుతున్న బకాయిపడ్డ 6 నెలల జీతంతోపాటు 40 నెలల ఈపీఎఫ్ చెల్లించాలని గత 38 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో పోలీసుల సమక్షంలో జరిగిన చర్చల్లో అధికారులు మాట్లాడుతూ సమ్మెను విరమించాలని ఈనెల 17న మూడు నెలల జీతం, 30న పీఎఫ్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇందుకు కార్మికులు విముఖత వ్యక్తం చేశారు. చర్చల పేరుతో ఇలా మూడు సార్లు హామీ ఇచ్చి నెరవేర్చకుండా అన్యాయం చేశారని ఇప్పుడు మాత్రం అలా జరుగనివ్వమని డిమాండ్లన్నీ పరిష్కరించాకే సమ్మె విరమిస్తామని తేల్చి చెప్పారు. చర్చల్లో వీఆర్‌వో లక్ష్మన్న, యూనియన్ మాజీ నాయకులు నాగరాజు, కొండారెడ్డి, రామాంజి, వన్నూరుస్వామి, ఆఫీస్ బేరర్‌లు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారమివ్వాలి

-కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు

ఉరవకొండ, మే 13 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

వ్యవసాయం కోసం చేసిన అప్పుల భారం భరించలేక ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు 20 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. వారం రోజుల వ్యవధిలో ఉరవకొండ నియోజకవర్గంలోని నలుగురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమైన విషయమన్నారు. విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో బోయ సుధాకర్, పెద్దకొట్టాలపల్లి గ్రామంలో హరిజన రాముడు, వజ్రకరూరు మండలంలో వెంకటాంపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన సోమ్లానాయక్, ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన హరిజన ఎర్రిస్వామి వ్యవసాయంలో నష్టాలు మిగలడంతో జీవితంపై విరక్తిచెందిన బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం మానవతా దృక్పదంతో ఆలోచించి సమగ్ర విచారణ చేసి కౌలు రైతు కుటుంబాలను పరిహారం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మోపిడి రేణుమాకులపల్లి అధ్యక్ష కార్యదర్శులు సుంకన్న, సురేష్, రాంమూర్తి, కౌతు రైతులు అశ్వర్ధనారాయణ, ప్యాపిలి ఎర్రిస్వామి, వెలిగొండ ఓబయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దైవ సేవకులు వారి బలహీనతలను గుర్తుపెట్టుకోవాలి

- ది బైబిల్ ఫౌండేషన్ సేవకు లు గాలి గంగరాజు.



పాస్టర్లకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, మే 13 ప్రభాతవార్త:

దైవ సేవకులు వారి బలహీనతలను గుర్తుపెట్టుకోవాలని ది బైబిల్ ఫౌండేషన్ తిరుపతి సేవకులుగాలి గంగరాజు పేర్కొన్నారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన మంగళ వారం రాచనపల్లి పంచాయతీలోగల యేసుకృపామందిరంలో 59వ సర్వసభ్య సమావేశం, దేవునికి మహిమకరముగా నిర్వహించారు. పాస్టర్ పి.మార్క్ స్తుతి ఆరాధన చేయగా, అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు ముఖ్య ప్రసంగీకులు రెవ గాలి గంగరాజు ది బైబిల్ ఫౌండేషన్ తిరుపతి సేవకులకు పరిచయం చేశారు. ముఖ్య ప్రసంగీకులు సేవకుడు సరి చేసుకోవలసిన ఏడు విషయములను దైవ సేవకులకు వివరించారు. కుటుంబ ప్రార్థన కలిగి ఉండాలి, మనము మన బలహీనతలను బట్టిగాక దేవున్ని బట్టి మనము ధైర్యం తెచ్చు కోవాలని,మొదట మనము మన ఇంటిని సరిచేసుకుని అప్పుడు సంఘమును సరి చేయాలి. గౌరవ అధ్యక్షులు ప్రకాష్ బాబు సేవకుడు ఉత్తమమైన దానిని ఎన్నుకోవాలన్నారు.తరువాత గౌరవ అధ్యక్షులు బందెల రాజు బైబిల్ మిషన్ ఏ ఓ సేవకుడు దేవునితో గడపాలి అని వివరించారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు చల్లా కిషోర్ చౌదరి కళ్యాణదుర్గం, వైపి బాబు గుత్తి, పాస్టర్ శామ్ సన్‌నాయక్ అనంతపురం, పాస్టర్ గిద్యోన్ గుంతకల్లు, పాస్టర్ వీరేష్ రాయదుర్గం, తరువాత కమిటీ సభ్యులు పాస్టర్ జీవన్ బాబు, పాస్టర్ మనసే,పాస్టర్ జాషువా జహంగీర్, పాస్టర్ శాంత వర్ధన్, పాస్టర్ విజయ్ సింహ్ హాజర య్యారు. చివరిగా దేశం కొరకు ,సైనికుల కొరకు, త్రివిధ దళాధిపతుల సైన్యం కొరకు, రాజకీయ నాయకుల కొరకు, అధికారుల కొరకు భారతదేశ క్షేమం కొరకు,శాంతి భద్రతల కొరకు ప్రార్థించడము జరుగుతుందన్నారు. ముగింపు ప్రార్థన గౌరవ అధ్యక్షులు బందెల రాజు చేయగా ఆశీర్వాదము పాస్టర్ నెహెమ్యా నాగరాజు అందించి అనంతరం ప్రేమ విందు తో కార్యక్రమం ముగించారు.

## నారా లోకేష్ పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దృశ్యం

గుత్తి, మే 13 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గుత్తి పర్యటన పురస్కరించుకుని ఆ పార్టీ నేతలు ముమ్మరంగా ఏర్పాట్లు గావిస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎమ్మెల్యే జయరాం తనయుడు, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ తదితరులు మాసినేని గ్రాండ్ హై స్కూల్ ఎదురుగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేస్తున్న వసతి సౌకర్యాలను మంగళవారం పర్యవేక్షించారు. కాగా మంత్రి 15న కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. స్థానికంగానే బస చేస్తారు. అనంతరం మండలంలోని బేతాపల్లి గ్రామంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ గావిస్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 13 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

### 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

బ్రహ్మసముద్రం మే 13 ప్రభాతవార్త



అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ

ఎస్పీ ఆదేశాల మేరకు బ్రహ్మసముద్రం ఎస్ఐ మరియు అనంతపూర్ జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బంది ఖచ్చితమైన సమాచారం మేరకు బొబ్బర్లపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా 13 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ 3,22,990 రూపాయలను స్వాధీనం చేసుకొని 9 ద్విచక్ర వాహనాలు 11 మొబైల్ ఫోన్లు పట్టుకొని వారిని స్టేషన్ కు తీసుకుని వచ్చి వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరేంద్ర కుమార్ తెలిపారు.

## అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య...!

ధర్మవరం, మే 13(ప్రభాతవార్త)



ఉరివేసుకుని ఆత్మహత్యవేసుకున్న చేనేత కార్మికుడు చంద్రశేఖర్

అప్పుల బాధ తాళలేక ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ రెడ్డప్ప, బంధువులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోనిబాలాజీ నగర్కు చెందిన కె.చంద్రశేఖర్ (53) కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుం టుండేవాడు. అయితే నేసిన చీరకు గిట్టుబాటు ధర లబించలేదు. దీంతోపాటు కుటుంబ అవసరాలు పిల్లల చదువులకోసం, ముడిసరుకుల కోసం రూ.5 లక్షలు అప్పులు చేశాడు. వాటిని ఎలాతీర్చాలంటూ కుటుంబసభ్యులతో తరచూ అంటుం డేవాడు. చివరికి అప్పులు తీర్చేమార్గంలేక ఇంటి బయటకు కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా చంద్రశేఖర్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. కుటుంబసభ్య లు ఉదయం లేచి తలుపులు తీసిచూడగానే చంద్రశేఖర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో టూటౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని మృతుని భార్య ఉమాదేవి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు కేధార్, కుమార్తె సాంబవి ఉన్నారు.

## రెండు కార్లు ఢీ

బత్తలపల్లి మే 13 ప్రభాతవార్త



ప్రమాద స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారి వైద్యంక్షన్లో రెండు కార్లు ఢీకొనగా ఈ ప్రమాదంలో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదము జరగలేదు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు బత్తలపల్లి వై జంక్షన్‌కు కొద్దీ దూరంలో అనంతపురం వైపు వెనుక ముందు వెళుతున్న రెండు కార్లు డీ కొట్టుకొనగా రెండు కార్లు పూర్తిగా డ్యామేజి అయ్యాయన్నారు. కార్లు ఢీకొన్న సమాచారం అందగానే సంఘటన స్థలానికి వెళ్లి పోలీసులు పూర్తి సమాచారం సేకరించారు. ఈ ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. ఒక కారు వాళ్లు మామిడి కాయలు వ్యాపారం కోసం ధర్మవరంకు వెళ్లి తిరిగి అనంతపురం వెళుతుండగా, మదనపల్లి నుండి అనంతపురంలో పెళ్ళికి మరో కారు వెళుతోందన్నారు. మదనపల్లి నుండి వస్తున్న కారును ధర్మవరం వైపు నుండి వసున్న కారు ఢీ కొట్టగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నిరక్షరాసులను గుర్తించండి -వయోజన విద్య పర్యవేక్షకులు

కొత్తచెరువు, మే 13 ప్రభాతవార్త.

శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు వెలుగు మండల సమాఖ్య కార్యాలయం నందు మంగళవారం రెండో విడత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్,మధు సూదన్‌లు పుట్టపర్తి ఏరియా మండలాలకు సంబంధించిన వెలుగు సిసిలు,ఏపీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్, మధుసూదన్‌లు మాట్లాడుతూ కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు సంబంధించిన గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన నిరక్షరాస్యుల గుర్తించాలని, గుర్తించిన నిరక్షరాశుల వివరాలను వయోజన విద్యాశాఖ వారు ఇచ్చిన ప్రొఫార్మాలో పొందుపరచాలని తెలిపారు. కొత్తచెరువు బుక్కపట్నం మండలాలకు సంబంధించిన నిరక్షరాశుల వివరాలు యస్.సిలు 150,ఎస్టీలు 100,ముస్లిం, క్రిస్టియన్ లు 50,బిసి,ఓసిలు 1000 మంది మొత్తం 1300 మంది నిరక్షరాసులను ఒక్కో మండలానికి గుర్తించాలని తెలిపారు.గుర్తించిన పిదప ప్రతి 10 మంది నిరక్షరాశులకు ఒక వాలంటీర్ ను నియమించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్, మధుసూదన్,ఏరియా కోఆర్డినేటర్ పద్మావతి మరియు కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

## పిడిఎస్యు కమిటీ అధ్యక్షులుగా అశోక్

కొత్తచెరువు మే 13 ప్రభాతవార్త

కొత్తచెరువు మండలంలో (శిదీళీగి) పిడిఎస్యు విద్యార్థి సంఘం సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శిదీళీగి జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి మరియు ఉపాధ్యక్షులు పవన్ కుమార్ హాజరు కావడం జరిగింది ఈ సమావేశంలో కొత్తచెరువు మండలం నూతన కమిటీని 11 మందితో ఎన్నుకోవడం జరిగింది ఈ శిదీళీగి కమిటీకి అధ్యక్షునిగా అశోక్ కార్యదర్శిగా హితేష్ ఉపాధ్యక్షుడిగా సాయి సహాయ కార్యదర్శిగా దినేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలువిద్య సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు దానితోపాటు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల విద్యాథోపిడికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో శిదీళీగి జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ పాల్గొన్నారు.

